నేడు అగ్రి వర్సిటీలో టాసా ఎన్నికలు

వ్యవసాయ యూనివర్సిటీ (హైదరాబాద్), మే 27: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో తెలంగాణ అగ్రికల్చర్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) గుర్తింపు సంఘంకు ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. బుధవారం 9 ప్రాంతాలలో పోలింగ్ జరుగనుంది. ఈ పోలింగ్‌లో 440 మంది శాస్త్రవేత్తలు, అధ్యాపకులు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటివరకు ఏకగ్రీవంగానే టాసాకు పాలకవర్గ సభ్యులను ఎంపిక చేసేవారు. ఈసారి మొదటిసారి వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ జానయ్య నోటిఫికేషన్ విడుదల చేసి, ఎన్నికల నిర్వహిస్తున్నారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ సమీర్ కుమార్‌ను నియమించారు. డాక్టర్ రజినీకాంత్, డాక్టర్ రాజేశ్వర్ నాయక్, డాక్టర్ కే పవన్ చంద్రా రెడ్డి, ప్యానల్ పోటీ పడుతున్నాయి. తమ బ్యానర్లు గెలిపిస్తే అధ్యాపకులకు రావలసిన హక్కును సౌకర్యాలను సాధించడానికి కృషి చేస్తామని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈనెల 30న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఎన్నికలో గెలుపొందిన అధ్యక్షులు 2028 వరకు కొనసాగుతారు.

ఐజీసీఎస్ఈ పరీక్షల్లో..

శ్రీచైతన్య ఫ్యూచర్ పాత్‌వేస్ విద్యార్థుల ప్రతిభ

సిటీ బ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): ఐజీసీఎస్ఈ పరీక్షల్లో శ్రీచైతన్య ఫ్యూచర్ పాత్‌వేస్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచారని యాజమాన్యం ప్రకటించింది. 3 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న 24 మంది విద్యార్థులు పదో తరగతి ఐజీసీఎస్ఈ పరీక్షలు విజయవంతంగా పూర్తిచేశారని వెల్లడించింది. ఈమేరకు గచ్చిబౌలికి చెందిన 13 ఏండ్ల ఎనిమిదో తరగతి విద్యార్థిని లక్ష్మి అనిక నరసింహదేవర 10వ తరగతికి చెందిన ఐజీసీఎస్ఈ రసాయన శాస్త్రంలో 93 శాతం మార్కులు సాధించి ప్రపంచ రికార్డు నెలకొల్పిందని వెల్లడించింది. పాఠశాల డైరెక్టర్ సీమా బొప్పన, చీఫ్ ఆఫ్ అకడమిక్స్ పుష్పవల్లి, ఏజీఎం శివరామకృష్ణ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు.

కురుమ సంఘం ఎన్నికల కమిటీ నియామకం

అబిడ్స్ మే 27: రాష్ట్ర కురుమ సంఘం ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల కమిటీని నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం తెలిపారు. మంగళవారం నగరంలోని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం భవనంలో నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులను ఆయన ప్రకటించారు. ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా న్యాయవాది ఏ శ్రీనివాస్ కురుమ, సభ్యులుగా గొరిగే కృష్ణ కురుమ, న్యాయవాది కే సదానందం, డీ ప్రవీణ్ కుమార్, డీ ప్రకాష్ కుమార్‌ను నియమించారు. రాష్ట్ర కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, ఉపాధ్యక్షులు కొండల రాజు, శ్రీకాంత్, కోశాధికారి, మల్లేశం, సెక్రటరీ నర్సింహ, కన్నా తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో తెలంగాణ పాఠశాల విద్యారంగం

తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

చిక్కడపల్లి, మే 27: తెలంగాణ పాఠశాల విద్యారంగం సంక్షోభంలో ఉందని, కాంగ్రెస్ సర్కార్ ప్రభుత్వ ర్ బడుల అభివృద్ధిని పట్టించుకోవడంలేదని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) ఆధ్వర్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'తెలంగాణ పాఠశాల విద్యారంగ సమస్యలకు, సవాళ్లకు, సంక్షోభానికి జవాబులు వెతుకుదాం రండి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీపీజేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు చేపట్టాలని, బడ్జెట్లో కేటాయింపులు పెంచాలన్నారు. సంవత్సరం వారిగా మూత పడుతున్న బడుల సంఖ్య పెరుగుతూనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రమాదకరంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు..

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువచ్చిన మార్పులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలను పూర్తిగా ధ్వంసం చేసే విధంగా ఈ మార్పులు ఉన్నాయని తెలిపారు. నేడు విశ్వవిద్యాలయాల్లో ఒకే భావజాలం కలిగిన అధ్యాపకుల రిక్రూమెంట్ కొనసాగుతోందని తెలిపారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ..తెలంగాణ పునర్నిర్మాణం జరగాలంటే విద్య ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. టీపీజేఏసీ కోకన్వీనర్ కన్నగంటి రవి అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో మైస శ్రీనివాస్, ఎంబీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్ వెంకట్ రెడ్డి, అంబటి నాగయ్య, డాక్టర్ వనమాల, బి కొండల్ రెడ్డి, కే వేణుగోపాల్, రవిచంద్ర, భాగ్యలక్ష్మి, ఎస్టీయూ నాయకుడు పర్వత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులది కీలకపాత్ర

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

తెలుగు యూనివర్సిటీ, మే 27: తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులది కీలక పాత్ర అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈనెల 31న జలవిహార్‌లో నిర్వహించనున్న టీజేఎఫ్ రజతోత్సవాల వాల్‌పోస్టర్‌ను మంగళవారం గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఉద్యోగాలను కూడా లెక్క చేయకుండా సమైక్యాంధ్రలో తెలంగాణ జర్నలిస్టులు ఉద్యమించారని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, టీయూ డబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి యోగానంద్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్, టీయూడబ్ల్యూజే హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాకేష్ రెడ్డి, సోమేష్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు నవీన్, రమణ, శివారెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్, రవికుమార్, భూపతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల హామీల అమలులో సర్కార్ విఫలం

తెలంగాణ ఉద్యమ కారుల జేఏసీ

నిరాహార దీక్షా కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ చెరుకు సుధాకర్

కవాడిగూడ, మే 27: తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంభించడం సరైంది కాదని తెలంగాణ ఉద్యమ కారుల జేఏసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉద్యమకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా వారి సంక్షేమాన్ని మరిచిందని వారు ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమ కారుల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన తెలంగాణ ఉద్యమ కారుడు డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి 200 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఉద్యమ కారులకు ప్రతీనెలా రూ.30 వేల గౌరవ వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. మలిదశ ఉద్యమంలో అమరులైన 1200 మందిలో గత ప్రభుత్వం కొంతమందికి సహాయం చేసిందని, మిగతా వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

స్మృతివనం ఏర్పాటు చేయాలి..

100 ఎకరాలలో అమరుల స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని, విద్యా, ఉద్యోగ, రాజకీయాలలో 2 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అమరుల కుటుంబాలకు ఉచిత బస్సు, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలన్నారు. అన్ని రకాలుగా నష్టపోయిననుద్యమకారులకు వ్యాపార నిమిత్తం 50 శాతం సబ్సిడీతో కూడిన రుణాలు ప్రభుత్వమే నేరుగా అందించాలన్నారు. తెలంగాణలోని ప్రతి జిల్లాలో ఉద్యమకారుల స్మారక భవనం నిర్మించాలన్నారు. ఈ దీక్షా కార్యక్రమంలో గద్దర్ కుమారుడు సూర్యం, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రెటరీ జనరల్ ప్రఫుల్‌రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య, క్రిష్టోఫర్, వైస్ చైర్మన్ తుల్జారెడ్డి, అన్వర్‌పటేల్, బుజ్జి, గోకపద్మ, మాధవి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అతివలకు అండగా..

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారు. ఒక్కో సెంటర్‌కు ప్రతినెలా 60 మంది వరకు మహిళలు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.వేలల్లో ఖర్చు అయ్యే ఈ పరీక్షలను యూపీహెచ్‌సీలు, బస్తీ దావఖానల్లో ఉచితంగానే చేస్తున్నారు.

సత్ఫలితాలిస్తున్న ఆరోగ్య మహిళ..

జిల్లాలో ఆరోగ్య మహిళా కార్యక్రమం మంచి ఫలితాలనిస్తుంది. ఆశాలు, ఏఎన్ఎంలు, మెడికల్ అధికారులు బాధితులను గుర్తించి పరీక్షలు నిర్వహించడంలో కీలక భూమిక పోషిస్తున్నారు. రోగాన్ని ముందుగానే గుర్తించి వైద్యమందించడంలో పురోగతిలో ఉన్నాం.

– డాక్టర్ జయమాలిని, జిల్లా ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్

సమాజ హితాన్ని కోరేదే సాహిత్యం

తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి

మాట్లాడుతున్న డా.నామోజు బాలాచారి

రవీంద్రభారతి, మే27: సాహిత్యం ఎప్పుడూ సమాజ హితాన్ని కోరుకుంటుందని, ఆ విధంగా సాహిత్యం అనేక ప్రక్రియలలో వ్యాపించి ఉందని, అలాంటి సాహిత్య ప్రక్రియలో కథ సాహిత్యము బలమైన ముద్ర వేసుకున్నదని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి అన్నారు. అలాంటి కథా సాహిత్యాన్ని నేటి తరం రచయితల చెంతకు తీసువెళ్లేందుకు సాహిత్య అకాడమీ ప్రయత్నిస్తుందని ఆయన తెలిపారు. మంగళవారం సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో కథ కార్యశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా నేటి తరం రచయితలకు కథలపై అవగాహన కలిగించి, కథలు ఎలా రాయాలని అనే అంశంపై ఒక్కరోజు కార్యక్రమం నిర్వహించింది. కథా శిక్షణా కార్యక్రమానికి ముఖ్య ప్రసంగకర్తగా ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్, కాల్వ మల్లయ్య, డాక్టర్ వెల్దండ శ్రీధర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా కథ రచనల్లో అనుసరించిన అనుభవాలను నేటి తరం రచయితలకు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి వివిధ రంగాలకు చెందిన సాహితీవేత్తలు పాల్గొనడమే కాక ప్రత్యేకంగా ముంబై నుంచి, ఇతర రాష్ట్రాల నుండి సాహితీవేత్తలు రావడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణా తరగతులకు పాల్గొన్న ప్రతి ఒక్కరికి సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నామోజు బాలాచారి ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్

చిక్కడపల్లి, మే 27: టీజీఎస్‌ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉందని, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పెండింగ్ అంశాలను దశలవారీగా పరిష్కరిస్తామని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. బాగ్‌లింగంపల్లిలోని టీజీఎస్‌ఆర్టీసీ కళాభవన్‌లో మంగళవారం రాష్ట్రస్థాయి ఎంప్లాయ్ వెల్ఫేర్ బోర్డు సభ్యులతో యాజమాన్యం సమావేశమైంది. ఈ సమావేశానికి సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.. నిబద్ధతతో పనిచేస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేస్తోన్న ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రతీనెల ఒకటో తేదీన జీతాలు చెల్లింపు, 21శాతం ఫిట్‌మెంట్‌తో 2017 పీఆర్సీ, 2013 ఆర్పీఎస్ బాండ్ల డబ్బుల విడుదలతో పాటు పెండింగ్ డీఏలను మంజూరు చేసిందని తెలిపారు. యాజమాన్యం తీసుకునే నిర్ణయాల వెనుక ఉద్యోగుల, సంస్థ ప్రయోజనాలే ఉంటాయి తప్ప.. ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలు ఉండవని సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, ఖుష్రోషా ఖాన్, సొలొమన్, వెంకన్న, రాజశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయ పుష్పతో పాటు హెచ్‌వోడీలు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ హస్తినకు పోవలె..!

(మొదటిపేజీ తరువాయి)

కూడా బాగానే ఉంది. దీంతో ఆది నుంచి మంత్రివర్గంలో బెర్త్ కోసం విశ్వ ప్రయత్నాలే చేస్తున్నారు.

ఔర్ ఏక్ ధక్కా..!

మంత్రివర్గంలో స్థానం కోసం మల్‌రెడ్డి మరోసారి యుద్ధమే మొదలుపెట్టినట్లు తెలుస్తున్నది. ఈ మేరకు వారం రోజులుగా ఢిల్లీలోనే మకాం వేశారు. ఎక్కే గడప.. దిగే గడప.. అన్నట్లుగా ఆయన ప్రయత్నాల్ని ముమ్మరం చేశారు. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు అనే సంకేతాలు వెలువడుతుండటంతో చివరి ప్రయత్నమే మరింత 'గట్టి'గానే చేయాలనుకుంటున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చినప్పటికీ మల్‌రెడ్డి మాత్రం అక్కడే ఉండి తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అంతేకాదు... రెండో రోజుల కిందట నియోజకవర్గంలోని కీలక నేతలు పలువుర్ని వెంటనే ఢిల్లీకి రావాల్సిందిగా కూడా ఆయన ఆదేశించడంపై నియోజకవర్గంలో తీవ్రచర్చ జరుగుతున్నది. అయితే ఢిల్లీకి వెళ్లిన నాయకులకు ఇప్పటివరకైతే మల్‌రెడ్డి కలవకున్నా..మీరైతే ఇక్కడే ఉండండి అని మాత్రం ఫోన్‌లో సూచించినట్లు తెలిసింది. దీంతోఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకే ఆయన అనుచరులను పిలిపించుకున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

అర్చకుల సంక్షేమంపై పట్టింపేదీ..?

దేవాదాయ అధికారుల తీరుపై బోర్డు సభ్యులు, అర్చక సంఘాల అసహనం

నేడు సచివాలయంలో అర్చక ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్ సమావేశం

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అర్చక మరియు ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్ సభ్యుల సమావేశం బుధవారం ఉదయం 11గంటలకు సెక్రటరియేట్‌లోని రెవెన్యూ మీటింగ్‌హాల్‌లో జరగనున్నట్లు దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ వామనరావు, ఎండోమెంట్ రెవెన్యూ సెక్రటరీ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఫైనాన్స్, బోర్డు సెక్రటరీ కమ్ ట్రెజరర్, దేవాదాయశాఖ కమిషనర్ ఎస్ వెంకటరావు, టీటీడీఈవో, ముగ్గురు వెల్ఫేర్ బోర్డు సభ్యులు జక్కాపురం నారాయణస్వామి, చిలుకమర్రి శ్రవణకుమారాచార్యులు, కాండూరి కృష్ణమాచార్యులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో అర్చక ఉద్యోగుల సంక్షేమానికి వినియోగించిన నిధులు, ట్రస్ట్ విధులు, ప్రస్తుతం ఉన్న పథకాలు, ట్రస్ట్‌లో ఉన్న నిధుల ప్రస్తుత పరిస్థితి, గత సమావేశంలో చేసిన తీర్మానాలపై తీసుకున్న చర్యలు, రిటైర్‌మెంట్ ఇతర సంక్షేమానికి సంబంధించి చర్చ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో పెద్దపీట

రాష్ట్రంలో అర్చకుల సంక్షేమానికి గతంలో కేసీఆర్ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అర్చక వెల్ఫేర్ ట్రస్ట్‌కు రూ.230 కోట్లు కేటాయించారు. అర్చకుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకున్నారన్నారు. ఈ సంవత్సరం మార్చి 31వరకు 246.14కోట్లు అర్చక సంక్షేమనిధి ఎఫ్‌డీఆర్‌లు ఉన్నట్లు, ఇవి కాక మరో రూ.1.04 కోట్ల నిధులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రతీ సంవత్సరం అర్చక సంక్షేమ నిధికి వడ్డీతో పాటు రాష్ట్రంలోని పలు ఆలయాల ఆదాయం నుంచి 5శాతం చొప్పున వివిధ రూపాల్లో రూ.15కోట్ల ఆదాయం వస్తుంది. గత సంవత్సర కాలంగా ఇందులో కేవలం 144 కార్యక్రమాల పేరుతో రూ.3.46కోట్లు మాత్రమే కేటాయించారు. ఎప్పటికప్పుడు అర్చకులకు సంబంధించిన సంక్షేమ విషయంలో అధికారులు పెద్దగా దృష్టి పెట్టకపోగా వచ్చిన దరఖాస్తులను కూడా పట్టించుకోలేదని అర్చక ఉద్యోగ సంఘ ప్రతినిధులు చెప్పారు.

అధికారుల తీరుపై అర్చకుల ఆగ్రహం..

ఇప్పటివరకు బోర్డు సభ్యుల ప్రమేయం లేకుండానే దేవాదాయ అధికారులు కార్యక్రమాలు నిర్వహించడం, అసలు బోర్డు సభ్యుల తీర్మానం లేకుండానే బిల్లులు తీసుకోవడంపై సభ్యులు, అర్చకులు ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. ఇటీవల నిర్వహించిన ఉగాది వేడుకలలోచోటుచేసుకున్న అపశృతులు, అందుకు వినియోగించిన డబ్బులతోపాటు ఈ సంవత్సరం అర్చకుల సంక్షేమానికి సంబంధించి నామమాత్రంగా నిధుల కేటాయింపుపై సభ్యులు చర్చించనున్నట్లు తెలిసింది. దేవాలయంలో పనిచేస్తున్న అర్చకులకు గ్రాట్యుటీతో పాటు కాంట్రిబ్యూటరీ పెన్షనరీ బెనిఫిట్స్‌పై ఈ సమావేశంలో చర్చించాలని తెలంగాణ దేవాదాయ అర్చక ఉద్యోగ జేఏసీ కోరింది. దేవాదాయ ఉద్యోగులకు సాధారణ ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి అన్ని బెనిఫిట్స్ కల్పించేలా తీర్మానం చేయాలని జేఏసీ ప్రతినిధులు ఉపేంద్రశర్మ, వీ రామ్మోహన్‌రావు కోరారు.

ప్రతీ గల్లీని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతాం

జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో ప్రతి గల్లీని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే ప్రీ మాన్‌సూన్ ముఖ్య ఉద్దేశ్యమని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ప్రీ మాన్‌సూన్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా మంగళవారం ఎల్బీనగర్‌లోని కార్పొరేటర్లు, అధికారులతో మేయర్ సమీక్ష సమావేశంనిర్వహించారు. కార్పొరేటర్లు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని మేయర్ తెలిపారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్ఈ అశోక్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కే నవజీవన రెడ్డి, ఎం లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీమతి అరుణ, శ్రీమతి బానోతు సుజాత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ పరిశ్రమల సమస్యలను పరిష్కరిస్తా

కేంద్రమంత్రి జితేన్ రామ్ మాంజీ

కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

అమీర్‌పేట్, మే 27: ఎంఎస్ఎంఈ సెక్టార్ పరిధిలో కొనసాగుతున్న ట్రేడర్స్, టెక్స్‌టైల్ ఇండస్ట్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కేంద్రమంత్రి జితేన్‌రామ్ మాంజీ అన్నారు. మంగళవారం బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఎంఎస్ఎంఈలో ట్రేడర్స్, టెక్స్‌టైల్ ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చాంబర్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ప్రతినిధులతో జరిగిన చర్చలో ఎంఎస్ఎంఈల తరహాలో ట్రేడర్స్‌కి కూడా సబ్సిడీతో కూడిన బ్యాంక్ రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని, అదేవిధంగా జీఎస్టి స్లాబ్‌ల విషయంలో కూడా 5% వెసులుబాటు కల్పించేలా తగిన చొరవ తీసుకోవాలని ఛాంబర్ అధ్యక్షుడు ప్రకాష్, ప్రతినిధులు సతీష్ కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫామ్ ప్రభావం వల్ల మీడియం, స్మాల్ ట్రేడర్స్ ఎదుర్కొంటున్న నష్టాల సమస్యను పరిష్కరించేందుకు వారికోసం మంత్రిత్వ శాఖ సమగ్ర విధానాన్ని రూపొందించి అమలు చేయాలని, చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి మరిన్ని సంస్కరణలు తీసుకురావాల్సిన అవరముందని కోరుతూ కేంద్రమంత్రికి వారు వినతిపత్రం అందజేశారు. ఛాంబర్ సమావేశంలో తాము కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చిన పలు అంశాల పట్ల సానుకూల స్పందన వచ్చిందని వారు తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

మెడికవర్‌తో టీటీపీవోఏ ఎంవోయూ

కొండాపూర్, మే 27: మెడికవర్ దవాఖాన, తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీటీపీవోఏ) సంయుక్తంగా మంగళవారం 'హెల్త్ కనెక్ట్ ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరు సంస్థలు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం టీటీపీవోఏ సభ్యులు వారి కుటుంబ సభ్యులకు మెడికవర్ దవాఖానలో ప్రత్యేక మెడికల్ సదుపాయాలు, రాయితీలను అందించనున్నట్లు మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీపీవోఏ సభ్యులు, మెడికవర్ దవాఖాన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉస్మానియాలో రోగి సహాయక సేవలు

- 24 గంటలపాటు పనిచేయనున్న హెల్ప్‌లైన్ డెస్క్
- మూడు షిఫ్టుల్లో సేవలందించనున్న హెచ్‌హెచ్‌ఎఫ్ వలంటీర్స్

హెల్ప్ డెస్క్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ రాకేశ్ సహాయ్

సిటబ్యూరో, మే27 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో రోగుల కోసం 24 గంటలపాటు రోగి సహాయక సేవలకోసం హెల్ప్‌లైన్ డెస్క్‌ను ప్రారంభించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాకేశ్ సహాయ్, బీఎస్బీ హ్యూమన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ప్రతినిధి సల్మాన్ బాబు ఖాన్ కలిసి మంగళవారం ఈ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సేవలతో రోగులకు తక్షణ సహాయం, మార్గనిర్దేశం అందుతుందన్నారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్(హెచ్‌హెచ్‌ఎఫ్) వంటి సంస్థలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో రోగులకు నిరంతరాయంగా సేవలందించేందుకు హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్‌కు చెందిన 20 మందికి పైగా శిక్షణ పొందిన స్వచ్ఛంద సేవకుల బృందం మూడు షిఫ్టులుగా సేవలు అందించనుందన్నారు. వీరంతా వివిధ విభాగాలకు రోగులను నడిపించడం, ఓపీ సేవల్లో సహకరించడం, గుర్తు తెలియని, అనాథ రోగులకు వైద్యం అందించడంలో కీలకంగా పనిచేస్తారన్నారు. హాస్పిటల్ పరిసరాల్లో కనిపించే అనాథ రోగులను సోషల్ హెల్త్ వర్కర్ల సహాయంతో శుభ్రం చేసి, బట్టలు తొడిగి, వైద్యం పొందేలా సహకరిస్తారన్నారు. వీల్ చైర్లు వంటి పేషెంట్ మొబిలిటీ సేవల కోసం ఈ ప్రత్యేక హెల్ప్‌లైన్ అమలు చేయడం అత్యంత అవసరమన్నారు. అత్యవసర విభాగం పక్కన ఉన్న ఓపీ బ్లాక్ ర్యాంప్ పక్కనున్న ఖాళీ ప్రదేశాన్ని ఒక వార్‌రూమ్‌లా మార్చామన్నారు. అక్కడే ఈ ప్రత్యేక హెల్ప్ లైన్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. రోగులు 77802 88622 ఈ హెల్ప్‌లైన్ నెంబర్లో సంప్రదించవచ్చని వారు పేర్కొన్నారు.

జెండా ఊపి అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న అతిథులు

కేర్‌లో 5జీ అంబులెన్సులు ప్రారంభం

సిటీబ్యూరో, మే27 (నమస్తే తెలంగాణ): "ది పవర్ ఆఫ్ త్రీ" పేరుతో కేర్ ఆస్పత్రి నూతన ప్రచారాన్ని ప్రారంభించింది. వేగవంతమైన స్పందన, నిపుణులచే చికిత్స, మరియు సానుభూతితో కూడిన సేవలపై దృష్టిపెట్టి, అత్యవసర వైద్య సేవల్లో కొత్త మార్పులకు నాంది పలికే విధంగా మంగళవారం హైదరాబాద్‌లో ఉన్న కేర్ ఆస్పత్రులలో 5జీ అంబులెన్సులను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా, గ్రూప్ చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ విశాల్ మహేశ్వరి, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డా.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.